

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 వరంగల్

శనివారం 10 ఫిబ్రవరి 2024







పులకించిన పుట్టి పెరిగిన నేల

మన పీవీ.. ఇక భారతరత్నం..

- మరణానంతరం 20 ఏళ్లకు దక్కిన గౌరవం
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు
- అంచెలంచెలుగా ప్రధాని స్థాయికి ఎదిగిన పీవీ

వరంగల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లక్నేపల్లి గడ్డపై పుట్టి. వంగర నేలపై పెరిగిన మన పీవీ నర్సింహరావుకు భారతరత్న పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్ ఎక్స్‌లో పీవీకి భారతరత్న పురస్కారంపై పోస్టు చేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన పీవీ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను పొందటంతో ఓరుగల్లు ప్రజల్లో హర్షం వ్యక్తంఅవుతోంది. రాజనీతిజ్ఞుడు, బహుబాషా కోవిదుడు, సంస్కరణలకు ఆద్యుడుగా పిలిచే పీవీ నర్సింహరావు.. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారతరత్నంగా నిలిచారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టి.. ప్రధానిగా పార్లమెంట్‌లో నిలిచి తెలుగు తేజస్సును దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి.

లక్నేపల్లిలో పుట్టి... వంగరలో పెరిగి..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28వ తేదీన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నర్సింహరావు జన్మించారు. ఇదే ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అయితే ఐదేళ్లకే అప్పటి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత హనుమకొండ జిల్లా) భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ దంపతులు పీవీని దత్తత తీసుకున్నారు. అప్పటి నుంచి పాములపర్తి వెంకట నర్సిం హరావుగా మారారు. హుజూరాబాద్‌లో పాఠశాల, హనుమకొండలో కళాశాల విద్యను పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ చదువు తుండగానే నిజాం సర్కారుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో కాంగ్రెస్ నేతలతో పాల్గొన్నారు. 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నిజాం ప్రభుత్వం నిషేధించిన వందేమాతరం గేయాన్ని పాడటంతో యూనివర్సిటీ నుంచి పీవీని బహిష్కరించారు. ఆ తరువాత నాగపూర్‌లోని ఓ మిత్రుడి సహాయంతో 1940 నుంచి 1944 వరకు ఎల్ఎల్‌బీ చదివారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన పీవీ.. కాకతీయ పత్రికను స్థాపించి జయ అనే మా రుపేరుతో వ్యాసాలు రాస్తూ నిజాంపై పోరాటాన్ని కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల కృష్ణారావుల అనుచరుడిగా స్వాతంత్ర్యోద్యమంలో పీవీ పాల్గొన్నారు. 1951లో ఏఐసీసీ సభ్యుడిగా పీవీ పదవి లభించింది. కాగా, పీవీ నర్సింహరావు సతీమణి సత్యమ్మరావు 1970 జూలై 1న మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మాజీ మంత్రి పీవీ రంగారావు పెద్ద కుమారుడు కాగా, సికింద్రాబాద్ మాజీ ఎంపీ పీవీ రాజేశ్వర్‌రావు, పీవీ ప్రభాకర్‌రావులు ఉన్నారు. పీవీ కుమార్తెల్లో ఒకరైన వాణిదేవి పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధిం చారు.

రాజకీయ ప్రస్థానం

కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలో 1957 నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962లో రెండోసారి విజయం సాధించిన తరువాత మంత్రిగా అవకాశంవచ్చింది. 1962 నుంచి 1971 వరకు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 1971లో సెప్టెంబరు 30న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల ఆ పదవిలో కొనసాగిన పీవీ.. అనూహ్య రీతిలో సీఎం పదవిని కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్ర రాజకీయాలకు గుడ్‌బై చెప్పి జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రాష్ట్ర రాజకీయాలకు కరీంనగర్ అండగా నిలబడితే జాతీయ రాజకీయాల్లో మాత్రం వరంగల్ జిల్లా నిలపెట్టింది. తొలిసారి 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హనుమకొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తరువాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో 1980లో మరోసారి పోటీచే సిన పీవీ రెండోసారి కూడా విజయం సాధించారు. 1980-84 మధ్యకాలంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత 1984లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హనుమకొండ నుంచి మూడోసారి పోటీ చేసిన పీవీ.. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే 1984లోనే మరోస్థానం మహ రాష్ట్రలోని రామ్‌టెక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేసి విజయం సాధించారు. 1984 నవంబరు నుంచి 1985 ఫిబ్రవరి వరకు భారత ప్రణాళిక శాఖ మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1985-1989 మధ్యకాలంలో కేంద్ర రక్షణ మంత్రిగా, కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా పీవీ పనిచేశారు. 1989లో నాలుగోసారి రామ్‌టెక్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1991లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హత్యకు గురైన తరువాత పీవీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991-96 మధ్య కాలంలో ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే సమయంలో ప్రధానమంత్రిగా కూడా పీవీ నర్సింహరావు బాధ్యతలు చేపట్టారు. 1991 జూన్ నుంచి 1996 మే 10వ తేదీ వరకు కొనసాగారు. ఐదేళ్ల పాటు మైనారిటీ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిన ఘనత పీవీదే.

> "రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడు పీవీ నర్సింహరావు ఈ దేశానికి అందించిన సేవలు అపారం..' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా అయన చేసిన సేవలు చిరస్మరణీయం. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ఆయన నాయకత్వం బలమైన పునాది వేసింది. పీవీ హయాంలో ప్రపంచ మార్కెట్‌ను భారత్ ఆకర్షించింది. ఆయన పాలనలో ఆర్థిక వృద్ధికి కొత్త శకం మొదలైంది. విదేశాంగ విధానం, విద్యారంగంలో ఆయన అందించిన సహకారం దేశాన్ని సాంస్కృతంగా, మేధోపరంగా దేశాన్ని సుసంపన్నం చేసింది."
>
> - ట్విటర్ ఎక్స్‌లో ప్రధాని మోదీ



వంగర, లక్నేపల్లిలో సంబరాలు 5



నిధులు గలగల పారేనా?

- రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు
- కాళేశ్వరం ప్రాజెక్టుకు కేటాయింపుపై సందిగ్ధం
- హెల్త్‌సిటీకి నిధులు అనుమానమే?
- మామునూరు ఎయిర్‌పోర్టుకు నిధులపై ఆశలు
- మేడారం జాతరకు వరాలు ప్రకటించే అవకాశం
- నేడు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం



హనుమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తోందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలలోని పలు సమస్యల శాశ్వత పరిష్కారానికి, సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన పనులు, అర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వాలంటే ప్రభుత్వం బడ్జెట్‌లో చాలినన్ని నిధులను కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఈదృష్ట్యా బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది.

కాళేశ్వరం నిధులు..?

భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ఈసారి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయిస్తుందన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గత బీఆర్ఎస్ సంవత్సరం ఈ ప్రాజెక్టు నిర్వహణకు పెద్దగా నిధులు కేటాయించలేదు. కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ కోసం మాత్రం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. కానీ ఒక్కపైసా కూడా విడుదల కాలేదు. కొత్త ప్రభుత్వం ఈ టూరిజం సర్క్యూట్ ప్రాజెక్టును కొనసాగిస్తుందా? నిధులు కేటాయిస్తుందా? అన్నదానిపై సందిగ్ధం నెలకొన్నది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని దేవాదుల, శ్రీ రాంసాగర్ తదితర ప్రాజెక్టులకు ఏ మేరకు బడ్జెట్‌లో పద్దులుంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మెగా టెక్స్‌టైల్ పార్క్

గీసుగొండ, శాయంపేట మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు కుంటినడక నడుస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో ఏ మేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత బడ్జెట్‌లో ప్రాతిపదిక సదుపాయల కల్పనకు రూ.160కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయింపు జరగవచ్చునని ప్రజలు ఆశిస్తున్నారు.

హెల్త్ సిటీ

వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో హెల్త్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి కూడా ఏమేరకు నిధుల కేటాయింపు జరుగుతుందో చూడాలి. గత ప్రభుత్వం రూ. 1100 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన విషయంలో కూడా వివాదం తలెత్తిం ది. ఈ ఆస్పత్రి స్థలాన్ని గత ప్రభుత్వం బ్యాంకులో కుదువబెట్టి రూ.2వేల కోట్లు తీసుకున్నదని, పైగా ఆస్పత్రి పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ప్రభుత్వం విమర్శిస్తోంది. ఈ పరిస్థితుల్లో దీనికి బడ్జెట్‌లో ప్రభుత్వం ఏ మేర కు నిధులు ఇస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి

మిగతా 4వ పేజీలో..



అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాధితులకు సత్వర న్యాయం చేయాలి..

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పారదర్శకంగా వ్యవహరించాలి..
- అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై అట్రాసిటీ కేసుల పురోగతిపై వరంగల్, నర్సంపేట, మామునూరు, వర్ధన్నపేట డివిజన్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తద్వారా సమస్యలు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న సంఘటనల గురించి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తేవాలన్నారు. వరంగల్ డివిజన్ పరిధిలో 10, నర్సంపేటలో 3, మామునూరులో 11,వర్ధన్నపేటలో 2 కేసులు వివిధ విచారణ దశల్లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పరిహారంగా బాధితులకు రూ. 25 వేలు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రేటర్ మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, గిరిజన సంక్షేమాధికారి సౌజన్య, సీపీవో జీవరత్నం, డీడబ్ల్యూవో శారద, ఎస్‌హెచ్‌వోలు గోపి, క్రాంతికుమార్, పవన్‌కుమార్, మల్లయ్య, మానిటరింగ్ కమిటీ సభ్యులు చిన్నస్వామి, యాదగిరి, మహేందర్, విజయ్‌కుమార్, భూక్య హస్సేన్ పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో పథకం అమలుపై సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ డీఎఫ్ఏ శివరాం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వడ్రంగి, కుమ్మరి, కమ్మరి, మంగలి, రజక, వడ్డెర, ఔసాలి, దర్జీ వంటి చేతి వృత్తుల పనులపై ఆధారపడి జీవించే వారికి ఈ పథకంలో ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. లబ్ధిదారులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్‌కార్డు, పత్రాలతో ఆధార్‌తో లింకైన సెల్ ఫోన్ నంబర్ జత చేసి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- హాజరు కానున్న 2,748 మంది విద్యార్థులు
- 9, 11 తరగతుల సీట్ల భర్తీ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 9: ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరు నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షకు 2,748మంది హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహనపై పరీక్ష కేంద్రాల పరిశీలకులు, సూపరింటెండెంట్‌లకు మామునూరు నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ నేతృత్వంలో ఇటీవల శిక్షణ సమావేశం నిర్వహించారు.

9వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1,404 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరికి వరంగల్ నగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల-మట్టెవాడ, జడ్పీ ఉన్నత పాఠశాల-నరేంద్రనగర్, జడ్పీ ఉన్నత పాఠశాల-శంభునిపేట, జడ్పీ ఉన్నత పాఠశాల-కృష్ణకాలనీ, జవహర్ నవోదయ విద్యాలయం-మామునూరు మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే 11వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1,344 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరికి వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-రంగశాయిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల- గిర్మాజీపేట, జెఎస్ఎం ఉన్నత పాఠశాల-ఉర్సు గుట్ట (వరంగల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల- కరీమాబాద్(వరంగల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల-శివనగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల- దేశాయిపేటలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

పరీక్ష రాసే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. పరీక్షను బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో మాత్రమే ఓఎంఆర్ షీట్‌లో రాయాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఏదో ఒక దానిని గుర్తించి ఓఎంఆర్ షీట్‌లో సర్కిల్‌ను నింపాల్సి ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ పద్ధతిలోనే ఉంటాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



కవిత (ఫైల్)

నల్లబెల్లి, ఫిబ్రవరి 9: ఓ మహిళ విద్యుదాఘాతంతో శుక్రవారం ఉదయం మృ తి చెందిన ఘటన మండలంలోని వేదనగర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసు కుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెం దిన బైకని కవిత(36) తన భర్త రాజు మొక్కజొన్న పంటకు పురుగుల మందు కొట్టడానికి ఉపయోగించే చార్జింగ్ పంపునకు చార్జింగ్ పెట్టారు. స్విచ్ బోర్డ్ వైరు, చార్జింగ్ పెట్టిన వైరు ఒకదానికొకటి వైర్లు ఫెయిల్ అయ్యి ఉన్నాయి. ఇది గమనించని కవిత చార్జింగ్ ప్లగ్‌ను తీసేటప్పుడు షాక్‌కు గురైంది. అదేసమయంలో సంఘం బ్యాంకు బుక్‌ల కోసం కవిత ఇంటికి వచ్చిన ముప్పారపు సూజాత వైర్లు కాలిపోయిన వాసన వస్తుండడంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి కవి త మృతి చెంది ఉంది. దీంతో సూజాత కేకలు స్థానికులను పిలిచింది. వ్యవసాయ భూమి వద్ద ఉన్న మృతురాలి భర్త కు, స్కూల్‌కు వెళ్లిన పిల్లలకు సమాచారం అందించారు. దీంతో వేదనగర్ గ్రామంలో శోకసంద్రం అలుముకుంది. అనంతరం మృతురాలి భర్త బైకని రాజు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తు న్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉంది.

మేడారంలో భక్తుల సందడి



మేడారం, ఫిబ్రవరి 9: తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ, బంధుమిత్రులతో కలిసి మహాజాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకుని తల్లులను నేరుగా దర్శించుకున్నారు. ఎత్తు బెల్లాలతో, పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించి యాట మొక్కులు చెల్లించకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో, డోలు వాయిద్యాలతో మేడారంలో సందడి చేశారు. ఈ క్రమంలో పరిసరాలన్ని భక్తులతో రద్దీగా కనిపించాయి. జాతర వైభవం ముందుగానే సంతరించుకుని మేడారం జాతర సందడి మొదలైందని వ్యాపారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు దేవాదాయ శాఖ అధికారులు నిరంతరం దర్శనాలు కల్పించడంతో తల్లులను భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా సమ్మక్క సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా, మేడారం మహాజాతరను పురస్కరించుకొని వనదేవతలు సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ లైట్లతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో తల్లుల గద్దెలు శనివారం భక్తులకు కనువిందు చేశాయి. రాత్రిళ్లు మొక్కులకై గద్దెకు వచ్చిన భక్తులు విద్యుత్ కాంతులను చూస్తు పరవశించి పోయారు.

లింకు జంకు!

- 'గృహజ్యోతి'కి రేషన్‌కార్డు అనుసంధానం
- ఉచిత విద్యుత్‌కు అదే ప్రమాణికం?
- రేషన్‌కార్డు లేనివారిలో ఆందోళన
- జిల్లాలో 2.48లక్షల పైగా కరెంట్ మీటర్లు
- రేషన్ కార్డు కోసం 41,493 దరఖాస్తు
- 15 వరకు సర్వే పూర్తి చేసేలా చర్యలు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాపై కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ప్రభుత్వం విద్యుత్ అధికారులను ఇంటింటికి పంపించి సర్వేచేసి వివరాలు తెలపాల్సిందిగా ఆదేశించింది. విద్యుత్ మీటర్లకు ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదు నెంబరును ప్రభుత్వం అందించిన గృహజ్యోతి యాప్‌లో పొందుపరుస్తున్నారు. తెల్లరేషన్ కార్డు అన్నింటికీ ప్రామాణికమని ప్రభుత్వం పేర్కొంది. ఈనెల 15 వరకు గృహ జ్యోతి యాప్‌కు లబ్ధిదారుల వివరాలు లింక్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యుత్ మీటర్లు కలిగి ఉండి, రేషన్ కార్డు లేక పోవడంతో పలువురు గృహజ్యోతి పథకం వస్తుందోరాదోననే భయాందోళన చెందుతున్నారు.

నో కార్డ్, నో ఫ్రీ కరెంట్..?

రేషన్ కార్డు లేకపోతే 200 యూనిట్ల ఉచిత కరెంటుకు అనర్హులుగా పరిగణించబడతారనే ఆందోళనలో ప్రజలు పడిపోయారు. సర్వేకు వచ్చే విద్యుత్ అధికారులు రూపొందించిన యాప్‌లో నమోదు సమయంలో సైతం రేషన్ కార్డు లేకపోతే, లేదు అని నమోదు చేసుకుంటున్నారు. తెల్ల రేషన్ కార్డు లేకపోతే ఉచిత కరెంటుకు అర్హులు కారని అధికారులు చెప్పకనే చెపుతున్నట్లు సమాచారం. జిల్లాలో 2,90,694 రేషన్ కార్డులు ఉండగా, అందులో ఆహార భద్రత కార్డులు 2,53,066 కాగా, అంత్యోదయ కార్డులు 37,628 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి. ప్రజాపాలన సందర్భంగా నూతనంగా 41,493 మంది జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే గృహాలకు వాడుకునే కేటగిరి-1కు సంబంధించిన విద్యుత్ మీటర్లు 2.48లక్షల పైగా కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి. దీనికితోడు ఇటీవల సైతం నూతనంగా మీటర్లు పెట్టుకున్న వారికి రేషన్ కార్డులు లేకుంటే ఎలాంటి పరిణామాలు ఉంటాయో తెలియడం లేదు. ఇంకా అద్దె ఇంట్లో ఉంటున్న వారు, రెండు మీటర్లు కలిగిన వారు ఇలా ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం, విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలో ఎస్ఈ ఆధ్వర్యంలో ఆయా సబ్ డివిజన్ల పరిధిలో ఏడీఈ స్థాయి అధికారి సహా ఏఈలు, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్పాట్ బిల్లు అందించే సమయంలో మీటర్లు కలిగి ఉన్న వారి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారు.



ఉప్పరపెల్లిలో విద్యుత్ మీటర్ల సర్వేను పరిశీలిస్తున్న ఏడీఈ కన్న రాజు

యాప్ పనితీరు ఇలా...

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ రూపొందించిన యాప్‌లో ఎంప్లాయి ఐడీ ఎంటర్ చేసి, వారికి అందించిన పాస్‌వర్డ్ ద్వారా యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. అనంతరం గృహజ్యోతి ఇన్ఫర్మేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకుంటారు. ఎంప్లాయి రిజిస్టర్ మొబైల్ ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని వెరిఫై చేసుకున్న తర్వాత ఎంప్లాయికి కేటాయించిన మీటర్ల వివరాలు వారి పూర్తి పేర్లతో కనిపిస్తాయి. ముందుగా మీటరు నంబరును ఎంటర్ చేసి, ప్రజాపాలనతో దరఖాస్తు చేసుకున్న రశీదు నంబర్‌ను నమోదు చేయాలి. నంబర్ లేకపోతే నాట్ ఫర్నిష్డ్ అని సెలెక్ట్ చేయాలి. అనంతరం ఆధార్, రేషన్ కార్డు నంబర్, ఫోన్ నంబర్లను సెలెక్ట్ చేయాలి. ఆ నంబర్లు లేకపోయిన నాట్ ఫర్నిష్డ్ అని సెలెక్ట్ చేసి సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది.

రేషన్ కార్డు లేక ఇబ్బందులు

దశాబ్దకాలంగా పేదలకు గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా జారీ చేయలేదు. నూతనంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇస్తుందనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు. ప్రజాపాలన పేరిట ఆరు గ్యారెంటీల కోసం తీసుకున్న దరఖాస్తుల్లో కూడా రేషన్ కార్డు లేనివారు దరఖాస్తు చేయాలని సూచించారు. కానీ కొత్త కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేసి వాటిని ఇవ్వకుండానే ఇతర పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. దీంతో రేషన్ కార్డులు లేనివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ పథకానికి రేషన్ కార్డే ప్రామాణికమని ప్రభుత్వం చెప్పకనే చెపుతుండడంతో పదేళ్లుగా కొత్తగా వివాహమై కార్డులు లేనివారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, రూ.500 వంట గ్యాస్ వంటి పథకాలకు అర్హులుగా ఉండమేమో అనే ఆందోళనలో ఉన్నారు. రేషన్ కార్డులు జారీ చేసిన తర్వాతే పథకాల అమలుకు శ్రీకారం చుడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిధులు గలగల పారేనా?

(3వ పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపు జరగవచ్చునని భావిస్తున్నారు.

నగరాభివృద్ధి

వరంగల్ నగరాభివృద్ధికి బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు పనుల పూర్తికి నిధులేమైనా బడ్జెట్‌లో కేటాయింపు జరుగుతుందా? నిధుల లేమి వల్ల కాళోజీ కళాక్షేత్రం పనులు పదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రూ. 50 కోట్లతో చేపట్టి ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. అంచనా వ్యయంతో రూ.100కోట్లకు పెరిగింది. కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

మెగా లెదర్ పార్క్

జనగామ జిల్లా పరిధిలోని మెగా లెదర్ పార్క్ ఏర్పాటు చేస్తామని 2016లో అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు సాకారం కాలేదు. ఈ పార్క్ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ దృష్ట్యా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగవచ్చునని జనగామ జిల్లా వాసులు ఆశపడుతున్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, దేవరుప్పుల, నష్కల్‌లో ఫుడ్ ప్రాజెసింగ్ జోన్ల ఏర్పాటు విషయమై బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

బయ్యారం ఉక్కు

గత బడ్జెట్‌లో మహబూబాబాద్ జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం మొండి చేయిచూపింది. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం సాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవలే ఢిల్లీలో ఈ విషయమై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రాథమిక పనులకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం నాటి బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన ఉండొచ్చని ఆశిస్తున్నారు. మల్యాలలో కృషి విజ్ఞాన కేంద్రం జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి స్మారక ఉద్యానవన ఫల పరిశోధన కేంద్రానికి అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోసం నిధుల ప్రకటనను జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

మేడారం జాతర

సీఎం రేవంత్ రెడ్డికి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో సెంటిమెంట్ ఉంది. కిందటేడు పాదయాత్రను ఇక్కడి నుంచే మొదలు పెట్టారు. ముఖ్యమంత్రిగా పదవిని అధిష్ఠించారు. ఈ క్రమంలో ఈ సారి జాతరకు రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం జాతరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రకటన ఏమైనా ఉంటుందా? అని ములుగు జిల్లా వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జాతరను జాతీయ పండుగ హోదాను కల్పించడంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే విషయమై బడ్జెట్‌లో ప్రస్తావన ఉంటుందా? అని చర్చించుకుంటున్నారు.

దిక్సూచి DIKSUCHI

మౌలానా ఆజాద్ వర్సిటీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్ట్‌లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలోగానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పయిర్/ఐకార్/ఐసీహెచ్ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/TfRqOkFలో చదవండి.

నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info



పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్ఠాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.

కాంబినేషన్ కుదిరింది





విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు



నేనూ ప్రేమలో పడ్డా



సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఐ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమా కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్https://ejyothy.com/eXnCM8Wలో చదవండి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0UvYLxHలో చదవండి.

త్వరలోనే రూ.500లకే గ్యాస్ సిలెండర్

గీసుగొండ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి స్కీం ద్వారా రూ.500 గ్యాస్ సిలెండర్ అందించబడుతుందని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. శుక్రవారం ఎలుకుర్తిలో నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలనలో అర్హులందరికీ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కల్యాణి, ఏవో హరిప్రసాద్‌బాబు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.



లబ్ధిదారుల ఎంపిక సర్వేలో మాట్లాడుతున్న సౌజన్య

బొడ్రాయి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి: కలెక్టర్

శంభునిపేట, ఫిబ్రవరి 9 : రంగశాయిపేటలో జరగనున్న బొడ్రాయి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. 11 నుంచి 14 వరకు రంగశాయిపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ బాధ్యులు శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వాన పత్రికను అందించారు. పోలీసు శాఖ ద్వారా సహకారం అందిస్తానని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. నిబంధనలు పాటిస్తూ ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకోవాలని కమిటీ బాధ్యులకు సూచించారు. వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీలతను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ బాధ్యులు కేడల జనార్దన్, నాయిని అశోక్, కేడల మల్లేశం, జీకే, బైరి రామేశ్వర్, శేర్ల అనిల్ కుమార్, లక్కాకుల రాహుల్, పోశాల మల్లికార్జున్ పాల్గొన్నారు.





కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిషోర్ ఝాకు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

కోటను సందర్శించిన జర్మనీ దేశస్థులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9: చారిత్రక ప్రాంతమైన ఖిలావరంగల్ కోటను జర్మనీ దేశస్థులు జోహా నా, జోన్‌లు శుక్రవారం సందర్శించారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాల ఆవరణలోని కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణ, ఖుష్‌మహల్, సింగారపుబావి, ఏకశిలగుట్టతో పాటు రాతి, మట్టికోటలను వారు ఆసక్తిగా తిలకించారు. వారి వెంట తెచ్చుకున్న కెమెరాలలో కాకతీయుల కాలంనాటి అద్భుత శిల్పసౌందర్యాలు, కట్టడాలను క్లిక్ మనిపించుకున్నారు. వారి వెంట హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ రమేష్, కుటుంబసభ్యులు లక్ష్మిబాల తదితరులు సందర్శించారు.



ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను తిలకిస్తున్న జర్మనీ దేశస్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు గొర్రెకుంట విద్యార్థులు

గీసుగొండ, ఫిబ్రవరి 9: ఇటీవల వరంగల్ సుందరయ్యనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీలలో గొర్రెకుంట జెడ్పీ పాఠశాల విద్యార్థులు బి.శ్రీచరణ్, ఎల్.అక్షయ్, ఎల్.స్వదీప్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ రఘువీర్, హెచ్ఎం జ్యోతిర్మయి తెలిపారు. ఈనెల 10 నుంచి 12 వరకు ధర్మసాగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీచరణ్, అక్షయ్, స్వదీప్

పీఆర్టీయూ ఆవిర్భావ సంబరాలు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 9: పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఘనంగా జరిగాయి. వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇ.రవీందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డిలు జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... 70వేల పైచిలుకు ఉపాధ్యాయుల సభ్యత్వాలతో అతి పెద్ద సంఘంగా విరాజిల్లుతూనే సమస్యల సాధనకు నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమానికి అనేక జీవోలు సాధించి పెట్టిన సంఘంగా పీఆర్టీయూను వారు అభివర్ణించారు. పీఆర్టీయూ నిరంతరం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాడుతోనే విధుల పట్ల బాధ్యతయుతంగా పీఆర్టీయూ వ్యవహరిస్తుందన్నారు. అనంతరం సంఘానికి విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఎస్.రాధాకిషన్, వి. రాజిరెడ్డి, ఆర్. భుజంగరెడ్డి, బి.సుదర్శన్, ఎ.ఆంజనేయులు, ఎం.దేవ, పి. సుచిత్రదేవి, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్. ఉప్పలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నాయకులు పి.శ్రీహరి, ఎండీ.అబ్దుల్ గఫార్, టి. శ్రీనివాస్, ఎ.ఉపేందర్‌రెడ్డి, ఇ.సుమాదేవి, బి.సంధ్యారాణి, సోమయ్య, రాజేందర్‌రెడ్డి, కరణ్, సునీలరాణి, రవీందర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, విష్ణుమూర్తి, ప్రభాకర్‌రెడ్డి, రేణుకాదేవి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అమిత, మధు, జయశ్రీ, అనురాధ, మోహన్, కోమల్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామన్న, నేహాల్ పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మహాలక్ష్మి అమ్మవారికి అమావాస్య పూజలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9: పుష్య మాసం అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం శ్రీవరద దత్త క్షేత్రంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం జరిగింది. ఆలయ అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ అమ్మవారికి అమావాస్య పూజలు, కుంకు పూజ, కొత్త నాణెములతో ధనార్చన పూజను నిర్వహించారు. అభిషేకం అనంతరం అలంకరణ, అర్చన, నైవేద్య నివేదన, మహా మంగళ హారతి గావించారు. అనంతరం భక్తులందరికి తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సీఐకి పలువురి అభినందనలు

కరీమాబాద్, ఫిబ్రవరి 9: మిల్స్ కాలనీ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.మల్లయ్యకు కాంగ్రెస్ నాయకుడు, పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మల్లయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 34వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రావుల విజయరామచందర్, ముత్యాల విజయ్, పట్వారి సుధాకర్, తిరునగిరి వెంకన్న, దేవరాజు, సత్యం పాల్గొన్నారు.



సీఐకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

యూహెచ్‌సీ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



పీహెచ్‌ఎస్ డాక్టర్ భార్గవికి సమ్మె పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంభునిపేట, ఫిబ్రవరి 9 : అర్బన్ హెల్త్ సెంటర్ (యూహెచ్‌సీ)లలో పని చేస్తున్న ఏఎన్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్‌హెచ్ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నాలు కోరారు. కార్మికుల హక్కుల కొరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం రంగశాయిపేట అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ భార్గవికి సమ్మె పత్రాన్ని అందించారు. రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం స్కీమ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించినట్టే, ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. రెండు నెలలుగా ఏఎన్‌ఎంలను జీతాలు ఇవ్వటం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్డీ యాకూబ్, సుమలత, సుష్మ, సుమలత, విజయలక్ష్మీ, జయమనీ, విజయ, శ్రీలత, శారద, మృదుల, సతీష్, ప్రవీణ్, సీఓ సుజాత, రజిత, గౌస్ పాషా పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న బస్తర్ దంతేశ్వర్ అర్చక బృందం



అర్చక బృందాన్ని సన్మానించిన స్థానికుడు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఛతీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ దంతేవాడకు చెందిన దంతేశ్వరి దేవాలయం అర్చక బృందం శుక్రవారం నగరంలో పర్యటించారు. చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఖిలా వరంగల్‌లోని కాకతీయుల ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక డాక్టర్ తాళ్ల రవి, ఆర్ఎన్. అరవింద్, రాజులు వారిని సన్మానించారు. 14వ శతాబ్దంలో ఛత్తీస్‌గఢ్‌లో కాకతీయ రాజులు దంతేశ్వరి దేవాలయాన్ని నిర్మించారని అందుకే ఆ ప్రాంతానికి దంతేవాడ అని పేరు వచ్చిందని బస్తర్ జిల్లా వాసులందరికి ఈ అమ్మవారు కులదైవమని దేవస్థానం ప్రధానార్చకులు ముకుంఠాకూర్ తెలిపారు. ఈయన వెంటన మధుశంకర్, సైటర్ సూరజ్, బన్‌సింగ్, వీరసింగ్, ముంజి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే...



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలనతో మళ్లీ అధికారంలోకి బీజేపీ ప్రభుత్వమే రానుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శుక్రవారం గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా తూర్పుకోట, ఎస్సీకాలనీ 218బూత్‌లో వివిధ వర్గాలు, స్థానిక ప్రజలతో ఆయన సమావేశమై కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీసి, రాష్ట్రంలో జరిగే అభివృదికథ పనులన్నింటికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమే నిధులను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంది మశ్ళ మహేష్, 37వ, డివిజన్ అధ్యక్షుడు గోశ్ళ రాజ్‌కుమార్, 218 బూత్ అధ్యక్షుడు గొర్రె కోటి, మేకల రాజు, నలిగంటి నర్సింగం, వెల్పుల నందు, బరిగెల శ్రీనివాస్, సాయి అభిషేక్, ఎర్రబెల్లి కుమార్, గాదె బాబు, ఇస్రం నరసయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

సంగెం, ఫిబ్రవరి 9 : మండలంలోని బిక్కోజీ నాయక్ తండాలో శుక్రవారం వృద్ధులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉచిత శిబిరాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కిషన్ రావు, డాక్టర్ మహ్మద్ తహర్‌మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది శివకుమార్, గంగాధర్, పవన్, రమేష్, సుమంత్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులు

పీవీకి భారతరత్న ఇవ్వడంతో సంబరాలు



వరంగల్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మట్టెవాడ, ఫిబ్రవరి 9: దివంగత మాజీ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. అనంతరం టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ తూర్పు కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్త, బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, వన్నాల వెంకట్రమణ, బాకం హరిశంకర్, సిద్ధం నరేష్ పటేల్, రత్నం సతీషా, కుమార్, మహేష్, సిద్దోజు శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే వరంగల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య భవన్‌లో స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోనుపునూరి వీరన్న, ఆవోపా జిల్లా అధ్యక్షుడు మల్యాల వీరమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వైశ్య భవన్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వర్తక సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు అడెపు రవీందర్

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 9: దేశాయిపేట వర్తక సంఘ సభ్యుల సంక్షేమానికి, ఆర్థిక ఎదుగుదలకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు అడెపు రవీందర్ అన్నారు. దేశాయిపేట రోడ్డులో శుక్రవారం దేశాయిపేట వర్తక సంఘం 11వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం సభ్యుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తూనే, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సంఘాలతో సభ్యులందరూ ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వేడుకలలో భాగంగా ప్రతీ సభ్యుడికి పది గ్రాముల బంగారం అందజేశారు.కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వీరరౌతు విజయ్‌భాస్కర్‌రెడ్డి, కోశాధికారి శిరుప మాధవ్‌కుమార్, ఉపాధ్యక్షులు 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి, మావరపు విజయ భాస్కర్ రెడ్డి, మార్గం నాగరాజు, కానిగంటి అశోక్, సంయుక్త కార్యదర్శులు ఆకుల మహేష్‌కుమార్, అనపర్తి సురేష్‌కుమార్, ఎమ్డీ సమియోద్దీన్, ఆర్గనైజర్స్ తాళ్లపెల్లి పూర్ణచందర్, అడెపు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 9: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల అన్నారు. దేశాయిపేటరోడ్డులోని కార్యాలయంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ శ్రేణులు హరీష్, సాగర్, మౌటం శివకుమార్, మిరియాలకార్ సంతోష్, రాజేష్, అభిరామ్, నిఖిల్, ప్రభాస్, ఖలీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ల శరత్

రంగనాథస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

వరంగల్ టౌన్, ఫిబ్రవరి 9: నగరంలో ప్రసిద్ధిగాంచిన కాశిబుగ్గ శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని మహా చండీ యాగాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వంగరి రవి శ్రీజ, ప్రధాన కార్యదర్శి చిలుపురి సురేష్ రజినీ దంపతులు, కోశాధికారి సుల్తాన సమ్మక్క, ఉపాధ్యక్షులు కోలా కవిత,మంచాల సృజన, కూరపాటి రోజ, మౌటం వెంకన్న, సభ్యులు విరాట్ ప్రకాష్‌రెడ్డి, రావుల ప్రసాద్, గడ్డం భాస్కర్, ప్రధాన అర్చకులు క్రిష్ణమాచార్యులు నిర్వహించారు.



రంగనాథస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

అగ్నికి మహిళ ఆహుతి



కమలాపూర్ (హసన్‌పర్తి), ఫిబ్రవరి 9: ఇంట్లో నిలువ చేసిన పత్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతుండగా.. వాటిని ఆర్పుతున్న క్రమంలో మంటలు అంటుకుని మహిళ మృతిచెందింది. ఈ ఘటన శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెంలో జరిగింది. కమలాపూర్ హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెంకు చెందిన తోడేటి సౌందర్య(54) గృహిణి. భర్త తోడేటి రాజయ్య గీత కార్మికుడు. ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి నిలు వ చేసిన పత్తికి మంటలు అంటుకున్నాయి. గమనించిన సౌందర్య మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమె కూడా మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. ఇంట్లో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు తాటి వనంతో ఉన్న ఆమె భర్త రాజయ్యకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకుని తలుపులు తెరిచి చూసేసరికి పత్తితో పాటు భార్య పూర్తిగా కాలిపో యి కనిపించింది. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడం తో వచ్చి మంటలను ఆర్పారు. 8 క్వింటాళ్ల పత్తితో పాటు ఇంట్లో నిల్వ ఉన్న 6 క్వింటాళ్ల బియ్యం కూడా దగ్ధమయ్యాయి. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రాధిక గుప్తా



జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 9: వరంగల్ మహానగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తిగత కారణాలవల్ల ఈ నెల 22వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా రాధిక గుప్తాను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. ఈ క్రమంలో రాధిక గుప్తా శుక్రవారం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదనపు కమిషనర్‌లు అనిసూర్ రషీద్, రవీందర్ యాదవ్, పీఆర్వో అయూబ్ అలీ, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, క్రిష్ణారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ రమేశ్ తదితరులు రాధిక గుప్తాను కలిసి పూల మొక్కలు అందచేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మట్టెవాడ, ఫిబ్రవరి 9: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ కరీమాబాద్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన పెంట్ హౌస్ నిర్మాణాలను కూల్చివేసినట్లు ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిటీప్లానర్ వెంకన్న మాట్లాడుతూ అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులకు విరుద్ధంగా, అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదుతోపాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. ప్రతీ నిర్మాణానికి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కూల్చివేతల్లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లాన్ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బాలికల ఎంపిక

నెక్కొండ, ఫిబ్రవరి 9 : రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని సూరుపల్లి హై స్కూల్ విద్యార్థులు దొమ్మటి అనిత, మూడు జానకి ఎంపికైనట్లు హెడ్మాస్టర్ బత్తుల పరమేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఎనిమిది, తొమ్మిదో తరగ తి చదువుతున్న బాలికలు ఇటీవల గీసుగొండ హై స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఈ నెల 12 వరకూ జరుగు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను పీఈటీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన అనిత, జానకి

మద్ది మేడారంలో పనులను వేగంగా పూర్తి చేయాలి

- నల్లబెల్లి తహసీల్దార్ బొనగాని రాజేష్
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



జాతర పనులపై మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేష్


నల్లబెల్లి, ఫిబ్రవరి 9: సమ్మక్క సారలమ్మల జాతర సమీపిస్తున్న తరుణంలో మద్ది మేడా రంలో జాతర పనులను వేగంగా పూర్తి చేయాల ని సంబంధితాధికారుల కు, ప్రజాప్రతినిధులకు శుక్రవారం మద్ది మేడా రంలో మండల తహసీ ల్దార్ బొనగాని రాజేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'సమస్యల వలయంలో మద్ది మేడారం' కథనానికి స్పందించి మద్ది మేడారంను శుక్రవారం తహసీల్దార్ సందర్శించారు. అనంతరం మద్ది మేడారంలో ప్రారంభమైన రోడ్డు పనులను, స్నాన ఘాట్టాల పనులను పరిశీలించారు. అంతేకాక, ఈ జాతర అయిపోయేంతవరకు రైతులు వరి పంటను వేయొద్దని తెలిపారు. రైతులు నష్టపోకుండా ఆదుకుంటామని కూడా అన్నారు. అంతేకాక, విద్యుత్, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల తదితర పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సమ్మయ్య, చైర్మన్ గాదె సుదర్శన్, కడ్దూరి కట్టయ్య, ఏఈ ప్రభావతి, ఆర్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బలరాంకు అవగాహన ఉంది

- కేపీఎస్ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్ నాయక్

నెక్కొండ, ఫిబ్రవరి 9 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలోని ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు ఈ ప్రాంత ప్రజలతో పరిచయం కలిగిన వ్యక్తి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్‌ను ఎంపీగా రాబోయే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని కుల ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్‌నాయక్ కోరారు. శుక్రవారం నెక్కొండలోని ఆర్‌అండ్‌బీ అతిది గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అని రంగాల్లో వెనుకబడిన మహబుబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మాజీ మంత్రి కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేశాడన్నారు. అలాగే ఈ పార్ల మెంట్ నియోజక వర్గంలోని నెక్కొండ, కేసముద్రం, మహబుబాబాద్ రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇప్పించారన్నారు. అలాగే స్టేషన్‌లలో అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరీ చేయించారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బానోతు నవీన్‌నాయక్, హరిసింగ్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, అవినాష్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రమోహన్



నెక్కొండ, ఫిబ్రవరి 9 : నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. చంద్రమోహన్ గురువారం రాత్రి బాధ్యతలను చేపట్టారు. సీసీఆ ర్‌బీ నుంచి చంద్రమోహన్ బదిలీపై నెక్కొండకు వచ్చారు. నెక్కొండ సీఐగా విధులను నిర్వహించిన హతీరాంనాయక్ హైద రాబాద్ మల్టి జోన్-1 ఐజీకి అటాచ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. నూతన సీఐని వివిధ పార్టీల నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మసీదు కమిటీ ఎన్నిక

రాయపర్తి, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలో మసీద్ ఎ నూర్ కమిటీని శుక్రవా రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎండీ అబ్దుల్ రెహమాన్, అధ్య క్షుడిగా ఎండీ హుస్సేన్ పాషా, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఇక్బాల్, కమిటీ సభ్యులుగా రహీం, లాయక్ అలీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్, మాజీ ఉప సర్పంచ్ ఎండీ మహమూద్, యూత్ నాయకులు ఫిరోజ్, రియాజ్, అజహర్, రజాక్, యూసఫ్, షరీఫ్, వసీం, రఫీ, షకీల్, జావేద్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

పులకించిన లక్నేపల్లి

- పీవీకి భారతరత్న రావడంపై హర్షాతిరేకాలు



పీవీకి పూలమాలలతో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 9 : భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించడంతో శుక్రవారం ఆయన జన్మించిన లక్నేపల్లి గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలో 1921 జూన్ 28న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ జన్మించారు. ఆ తర్వాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు దత్తత తీసుకోవడంతో అప్పటి నుంచి పాములపర్తి వెంకటనర్సింహారావు అయ్యారు. పీవీ జన్మించిన లక్నేపల్లిలో ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పీవీ నర్సింహారావు స్మారక మందిరాన్ని నిర్మించి అందులో పీవీ సాధించిన విజయాలు, ఆయన రాజకీయ చరిత్రకు సంబంధించిన ఫోటోలను సందర్శనార్థం ఏర్పాటు చేశారు. ఆవరణలో పీవీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతీ ఏడాది జూన్ 28న జయంతి, డిసెంబర్ 23న వర్ధంతిని నిర్వహించడం జరుగుతున్నది.



లక్నేపల్లిలోని పీవీ స్మారక మందిరం



స్మారక మందిరంలోని పీవీకి సంబంధించిన ఫొటోలు

ఆనందంగా ఉంది..

మాడుగుల రవీంద్ర శర్మ, పీవీ స్మారక ట్రస్టు కార్యదర్శి, లక్నేపల్లి



దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్రంలో ని మోదీ ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించాలని నిర్ణ యం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన దేశానికి చేసిన సేవలకు నేడు తగిన గుర్తింపు వచ్చింది.

పీవీకి భారతరత్న ఇవ్వడం గర్వంగా ఉంది..

గొడిశాల రాంబాబు, మాజీ సర్పంచ్, లక్నేపల్లి



దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్నను కేంద్రం ప్రకటించడం ఎంతో గర్వంగా ఉంది. ప్రపంచస్థాయిలో దేశ ఆర్థిక స్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేసిన పీవీకి భారతరత్నం ఇవ్వడం సంతోషకరం.



పీవీకి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మోదీ చొరవతో పీవీకి భారతరత్న అవార్డు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 9 : దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును కాంగ్రెస్ పార్టీ విస్మరించినా, ఆయన సేవలను గుర్తించి కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం, ప్రధాని మోదీ చొరవతో ఆయనకు భారత రత్న అవార్డును ప్రకటించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం లక్నేపల్లిలోని పీవీ స్మారక మందిరాన్ని సందర్శించిన ఆయన పీవీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయం లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ దేశాన్ని అభివృద్ధి దిశలో నడిపించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డేపల్లి నర్సింహరాములు, రేసు శ్రీనివాస్, కంభంపాటి పుల్లారావు, రాణా ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్, ముత్తినేని వెంకటేశ్వర్లు, గూడూరు సందీప్ పాల్గొన్నారు.

- పీవీ చిత్ర పటానికి క్షీరాభిషేకం

వర్ధన్నపేట: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయపురం కుమారస్వామి, చీటూరి రాజు, కర్ర సోమిరెడ్డి, పెద్దూరి రాజ్‌కుమార్, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను విస్తరించాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 9 : తపాలా సేవలను విస్తరించాలని వరంగల్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్వీఎల్ఎన్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఎల్ఐసీ, ఆర్డీలు, డిపాజిట్లను సేకరించాలని అన్నా రు. పోస్టల్ బీమా చేయించడం ద్వారా ప్రమాదం సంభవిం చినప్పుడు త్వరితగతిన క్లెయిమ్‌లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం మురళీకృష్ణ, పోస్టుమాస్టర్లు నసీరుద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాలిలో దీపం కాంగ్రెస్ ప్రభుత్వం

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- 13న నల్గొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన సభ



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ, ఫిబ్రవరి 9 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గాలిలో దీపంలా ఉందనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఆరిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. నెక్కొండలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ నేతలకు సరైన అవగాహన లేకపోవడంతో అభివృద్ధిలో రోజు రోజకూ వెనకబడుతుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలోని ఆంధ్రప్రదేశ్ పాలన కంటే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అధ్వానంగా ఉందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న నల్గొండ జిల్లాలో చేపట్టనున్న నిరసన సభల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. నర్సంపేట నియోజక వర్గంలో గత ప్రభుత్వ కాలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి పలు ప్రతిపాదనలు పంపించడంతో పాటు నిధులు కూడా మంజూరైనట్లు పెద్ది తెలిపారు. ఆ అభివృద్ధి పనులను నేటి పాలకులు పూర్తిచేస్తే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జాటోతు రమేశ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంగని సూరయ్య, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, సొసైటి చైర్మన్ మారం రాము, జిల్లా నాయకులు కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, అబ్దుల్‌నబీ, తాటిపల్లి శివ, దొనికన సారంగపాణి, గుంటుక సోమయ్య సూరం రాజిరెడ్డి, లావుడ్యా హరికిషన్, వీరభద్రం, నరేందర్‌రెడ్డి , ఎండీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో బాలుర హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 9 : హన్మకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 15 బాలుర రెజ్లింగ్ పోటీల్లో నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటి బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన మహ్మద్ అమీర్ 41 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో, మహ్మద్ ముబిన్ 52 కేజీల విభాగంలో ప్రతిభను చాటి సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కొర్ర సారయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆర్డీఎఫ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి, ఫిబ్రవరి 9: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కల్లెడ గ్రామ ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో జరిగిన ఎంపికల్లో ఆర్డీఎఫ్ నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు, పోటీల్లో ముగ్గురు విద్యార్థులు బి.సంజుభార్గవ్, జి.హర్షిణి, ఎం.పౌర్ణమి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఈ నెల 10వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడతారని ఆయన తెలిపారు. ఈసందర్భఆ విద్యార్థులను పీఈటీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

యాసంగి వరి పంటల పరిశీలన



నెక్కొండ మండలం దీక్షకుంటల్లో పర్యటిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

నెక్కొండ, ఫిబ్రవరి 9 : యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు, ఉల్లి కొడు (గొట్టాలు) ఆశించుతున్నట్లు తమ పరిశోధనల్లో గుర్తించడం జరిగిందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ జీ.వీరన్న, డాక్టర్ సతీష్‌చంద్ర, డాక్టర్ అశ్విని, డాక్టర్ డీ.వీరన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని దీక్షకుంట, ముదిగొండ గ్రామాల్లో సాగుచేసిన వరి పంటలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఏఈవోలు రంజిత్‌కుమార్, అరుణ్‌కుమార్ , రైతులు పాల్గొన్నారు.

- ఖానాపూర్: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి వీరన్న, డాక్టర్ సతీష్‌చంద్ర, డాక్టర్ డి వీరన్న, అశ్వినిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు బొప్పిడి పూర్ణచందర్‌రావు, ఎడ్ల వాసుదేవరెడ్డి, పరుచూరి సుబ్బారావు, తోట సతీష్ పొనుగోటి యుగేందర్, ఏఈవో సంతోష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ .500ల గ్యాస్ అర్హుల సర్వే

చెన్నారావుపేట, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలో ఒక పథకంమైన రూ.500లకే గ్యాస్‌కు సంబంధించిన అర్హులైనా వారిని గుర్తించడానికి అధికారు లు ఇంటింటి సర్వేను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులు జాబితాను పరిశీలించారు. లబ్ధిదారులు గుర్తింపు వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

- దుగ్గొండి: మహాలక్ష్మీ పథకం సంబంధించిన దరఖా స్తులలో మండలంలో 7058 మంది లబ్ధిదారులు వంట గ్యాస్ నంబర్లు సరిగా వేయలేదని అధికారులు గుర్తించారు. వంట గ్యాస్ నంబర్లు సరిచేయడానికి గ్రామాల్లోని అంగన్ వాడీ టీచర్లు, కార్యదర్శులు, ఆశకార్యకర్తలు, మహిళా సం ఘాల సీఏలు మహిళలను గ్రామ పంచాయతీ భవనాల దగ్గరకు దండోరా ద్వారా పిలుపించుకొని యాప్‌లో వివ రాలు నమోదు చేస్తున్నారు. గ్రామ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో గ్రామస్థాయి అధికారులతోపాటు మండలస్థాయి అధికారులు బీజీ బీజీగా ఉన్నారు.

విద్యార్థుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- చైతన్య మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు కళ



భవ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఖానాపురం, ఫిబ్రవరి 9 : యాదాద్రి భువనగిరిలో హస్టల్‌లోని విద్యార్థుల అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కళ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు జనగం కుమారస్వామి అన్నారు. శుక్రవారం చైతన్య మహిళ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల అనుమానాస్పద మృతిపై నిజనిర్ధారణ కోసం భువనగిరి హాస్టల్‌లో మృతిచెందిన బుధరావుపేట గ్రామంలోని కోడి భవ్య కుటుంబ సభ్యులను కలుసుకొని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవ్య, వైష్ణవిలది ముమ్మాటికి హత్యేనని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా నాయకుడు కేసోజు లక్ష్మయ్య, మహిళా సంఘం సభ్యులు అనిత, విలాసిని, రమ పాల్గొన్నారు.

సదరం క్యాంపులో 135 మందికి నిర్ధారణ పరీక్షలు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9: వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో జిల్లాలోని 160 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నప్పటికి 135 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన దివ్యాంగులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పెన్షన్ అధికారులు సర్టిఫికెట్లు అందచేయనున్నారు. ఈ సదరం క్యాంపులో వైద్యాధికారులు చందునాయక్, నర్సింహరెడ్డి, వేణు, భరత్, వీరయ్యలు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డీఆర్‌డీఏ నుంచి కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి పర్యవేక్షించారు.

నమోదు ప్రక్రియను పరిశీలించిన చైర్ పర్సన్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9 : ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల భాగంగా వర్ధన్నపేట పట్టణంలో శుక్రవారం గ్యాస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి వివరాల నమోదు ప్రక్రియను మునిసిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ కమిషనర్ జోనాతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అర్హులకు పథకాలు అందేవిధంగా పని చేస్తామన్నారు.

ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను కలిగిఉండాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 9: ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్‌లను కల్గి ఉండాలని నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతీ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించరాదన్నారు. అనంతరం నూతనంగా వచ్చిన సీఐ చంద్రమోహన్‌ను ఎస్సై పస్తం శ్రీనువాస్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 9 : ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా సెక్రటరీ గుంపెల్లి ఈశ్వర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బంద్‌కు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరణ చేశారు. బంద్‌కు ఏఐసీటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎండీ మాషూక్ తెలిపారు. సమావేశంలో కొత్తకొండ రాజమౌళి, ఎంసీపీఐయూ మండల నాయకుడు జన్ను రమేష్, వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు భవాని పాల్గొన్నారు.

తునికాకు టెండర్లను వెంటనే పిలవాలి

- అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌కు న్యూడెమోక్రసీ వినతి



అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 9:నర్సంపేట అటవీశాఖ రేంజ్ పరి ధిలోని మండలాల్లో తునికాకు సేకరణ కోసం టెండర్లను వెంటనే పిలవాలని కోరుతూ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రేంజ్ ఆఫీసర్ రవికిరణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ డివిజన్‌లోని నర్సంపేట, నల్లబెల్లి,ఖానాపురం మండలాలతో పాటు రెడ్లవాడ తదితర గ్రామాల్లో గత సంవత్సరం తునికాకు టెండర్లు పిలవకపోవడం వల్ల గిరిజన, గిరిజనేతర పేదల ఉపాధి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఆకు సేకరణకు టెండర్లను పిలవడంతో పాటు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగిలి ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, తిరుపతి, వీరస్వామి, సాంబయ్య, రవి పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

దుగ్గొండి, ఫిబ్రవరి 9: కుక్క అడ్డురావడంతో నడుచుకుంటూ వెళ్లుతున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొట్టగా ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గీసుగొండ మండలం కొమ్మాలకు చెందిన రాంబాబు నర్సంపేట నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా గిర్నిబావి ప్రధాన రహదారిపై కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళ్లుతున్న లింగాపురానికి చెందిన ఓ వ్యక్తిని ఢీకొట్టగా రాంబాబుకు, లింగాపురం వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.గాయాలైన ఇద్దరిని చికిత్సకోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి అబులెన్స్‌లో తరలించినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. గాయాపడిన లింగాపురానికి చెందిన వ్యక్తి వివరాలు తెలియరాదు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9: హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలో సంతు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన జయంతి వాల్ పోస్టర్‌ను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆవిష్కరించారు. ఈ నెల 18న సంతు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలు ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధిం చిన ఈ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలి

ఖానాపురం, ఫిబ్రవరి 9: గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి అన్నారు. ఖానాపురం, బుధరావుపేట గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామ నర్సరీలను సందర్శించారు. వేసవిలో మొక్కల సంరక్షణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహాలక్ష్మీ పథకం డేటా ఎంట్రీని పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సుమనవాణి, ఎంపీవో రవి, పంచాయతీ కార్యదర్శులు సుప్రజ, రజిత పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి సాధించాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 9 : మహిళలు సంస్థలను బలోపేతంచేసి అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు వీఓ ప్రతినిధులు కృషి చేయాలని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ గొట్టె శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో వీఓ ప్రతినిధుల సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. సలహాలు, సూచనలు పాటిస్తూ సమన్వయంతో పనిచేసి పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పరిచి జీవనోపాదులను పెంపొందించాలని సూచించారు. లింగ వివక్షతలేకుండా జెండర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోరారు. రెండు రోజుల్లో లోకోస్ యాప్‌లో ప్రొఫైల్ డాటా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీపీఎం భవాని, ఏపీఎంలు వీర్ల వేణు, అశోక్, వేణుగోపాల్‌రావు, మండల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పల్లవి, అరుణ, సునిత, సీసీలు గోలి కొమురయ్య రమేష్, సంపత్, స్వామి, అన్ని గ్రామాల వీఓల ప్రతినిధులు, వీఓఎలు తదితరులు పాల్గొన్నారు.